




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 39

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 15 జూన్ 2025


# అవినీతిని సహించేది లేదు... రుజువైతే చర్యలు తప్పవు

**● ఆరోపణలు వస్తే తక్షణ విచారణ... 'జీరో కరెప్షన్ ఏపీ' లక్ష్యం ● 10 ముఖ్యమైన ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించండి ● ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణపై సమీక్షలో సీఎం చంద్రబాబు**



**అమరావతి, కలంకౌంటర్ :** ఏ శాఖలో, ఎక్కడ, ఎవరు అవినీతికి పాల్పడినా సహించేది లేదని... జీరో కరెప్షన్ దిశగా రాష్ట్రంలో పాలనా వ్యవస్థను నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడ అవినీతి జరుగుతుందో అక్కడ ప్రధానంగా దృష్టి పెట్టి విచారణ జరపాలని... అవినీతి రుజువైతే తక్షణం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి... వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై వ్యక్తమైన అభిప్రాయాలపై శనివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైనట్టు ఐవీఆర్ఎస్, సీఎస్‌డీఎస్ ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైందని... అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణపై టెక్నికల్ ఆడిటింగ్ జరపాలని... సమస్యలు ఉన్న చోట సంతృప్తి పెంచేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం, ఉద్యోగాలకల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి...వాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. వర్క్ ఫ్రమ్ హోమ్, పెట్టుబడుల రాక, నైపుణ్య శిక్షణతో ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో తెలియజేయాలన్నారు. 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు, ఆగస్ట్ 15 కల్లా అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర కింద అందించాలని స్పష్టం చేశారు. మరోవైపు...వికలాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి అందించండ మరింత మెరుగ్గా జరిగేలా ఆలోచన చేయాలన్నారు. చౌకధరల దుకాణాలను పెంచడం, నగదు... లేదంటే కూపన్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. అలాగే ఉచిత ఇసుక విధానం అమలులో...ఇసుక లేని చోట్ల సంతృప్తి, ఇసుక ఉన్న చోట అసంతృప్తి ఉండటంపై ప్రాంతాల వారీగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**ప్రజాభిప్రాయం ఇలా :**

**పింఛన్ల పింపిణీ :** అవినీతి లేదని 85 శాతం మంది, ఇంటిదగ్గరే ఇస్తున్నారని 87.8 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బావుందని 83.9 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎస్‌డీఎస్ ఫీల్డ్ సర్వేలో లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రశ్నించగా...పింఛన్ల పింపిణీలో అవినీతి లేదని 93.9 శాతం మంది, ఇంటిదగ్గరే ఇస్తున్నారని 93.3 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బావుందని 73.3 శాతం మంది-పర్వాలేదు అని 23.1 శాతం మంది చెప్పారు.

**అన్న క్యాంటీన్లు :** పరిశుభ్రంగా ఉన్నాయని 80.5 శాతం, ఆహారం నాణ్యత బావుందని 79.3 శాతం, సమయపాలన పాటిస్తున్నారని 80.8 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా చెప్పారు.

**ఆస్పత్రి సేవలు :** క్వాలిటీ చెకప్‌పై 68.4 శాతం, రక్త పరీక్షలపై 55 శాతం, ఉచిత మందుల పంపిణీపై 65.5 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 71.3 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.

**మున్సిపల్ సేవలు :** రోజూ చెత్త సేకరణపై 68.1 శాతం, 24 గంటల్లో చెత్త డంప్ తరలింపుపై 57 శాతం సంతృప్తి చెందారు.

**ఆలయాలు :** సౌకర్యాలకు సంబంధించి 68 శాతం దర్శనం బావుందని, 63.6 శాతం సౌకర్యాలు బావున్నాయని, 77.7 శాతం ప్రసాదం నాణ్యత బావున్నాయని భక్తులు చెప్పారు.

**ఏపీఎస్ఆర్టీసీ :** శుభ్రత, సీటింగ్ విషయంలో 53.4 శాతం, నీటి సౌకర్యం 45.2 శాతం, టాయిలెట్స్‌పై 56 శాతం, బస్సు సమయం-రూట్ వివరాలపై 61.5 శాతం, 69 శాతం మంది బస్సులు సమయానికి బయల్దేరుతున్నాయని, 69.7 శాతం సమయానికి చేరుకుంటున్నామని, 72.4 శాతం సిబ్బంది ప్రవర్తన బావుందని, 69.7 శాతం రక్షణ కలిగి ఉన్నాయని చెప్పారు.

**దీపం-2 :** ఎక్కువ డబ్బు వసూళ్లు చేయడం లేదని 62.8 శాతం చెప్పారు.

**రేషన్ :** నెలనెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నామని 75.1 శాతం, నాణ్యత బావుందని 73.8 శాతం చెప్పారు.

**ఎరువులు :** లభ్యత ఉందని 60.9 శాతం మంది రైతులు చెప్పారు.

**విత్తనాలు :** సమయానికి విత్తనాల సరఫరా జరిగిందని 63 శాతం చెప్పారు.

**గంజా, డ్రగ్స్ :** తమ ప్రాంతంలో డ్రగ్స్ సంబంధిత సమస్య ఉందని 27.4 శాతం, పోలీసులు స్పందిస్తున్నారని 54.5 శాతం మంది చెప్పారు.

**మహిళలపై హింస :** పబ్లిక్ ప్రాంతాల్లో వేధింపులు ఉన్నాయని 27.8 శాతం, పోలీసుల స్పందన బావుందని 59.5 శాతం, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని 56.3 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు.

**రిజిస్ట్రేషన్ సేవలు :** స్లాట్ బుకింగ్ ప్రాసెస్‌పై 63.4 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, అవినీతి లేదని 62.3 శాతం మంది చెప్పారు.

**ఇసుక :** రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌పై 70.6 శాతం, లభ్యతపై 67.5 శాతం, ధర పైన 61.1 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.

**రెవెన్యూ సేవలు :** ఎఫ్ లైన్‌పై ఎక్కువ డబ్బులు వసూళ్లు చేయడం లేదని 77.4 శాతం, పాస్‌బుక్ సర్వేలో ఎక్కువ మొత్తం తీసుకోలేదని 75.1 శాతం చెప్పారు.

**ఎలక్ట్రిసిటీ :** నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతోందని 61.6 శాతం చెప్పారు.

**పంచాయతీ సేవలు :** ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతోందని 56.7 శాతం చెప్పారు.

**ఎన్టీఆర్ వైద్య సేవ :** అడ్మిషన్లపై 86.2 శాతం, సేవలపై 81.3 శాతం, ఆరోగ్య మిత్ర సాయంపై 82.4 శాతం మంది సంతృప్తి వ్యక్త చేయగా... అవినీతి లేదని 78.5 శాతం అన్నారు.

# సవాల్ చేస్తే సౌండ్ ఆగిపోయింది: నారా లోకేశ ఎద్దేవా

**● వైసీపీ అధినేత జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు ● 'తల్లికి వందనం' నిధులపై చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని లోకేశ్ సవాల్ ● గడువు ముగిసినా జగన్ రుజువులు చూపలేదని, క్షమాపణ చెప్పలేదని వెల్లడి ● చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక ● శరణమా, న్యాయ సమరమా తేల్చుకోవాలని జగన్‌కు సూచన**



**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీ మంత్రి నారా లోకేశ్, వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. జగన్ చేసిన ఆరోపణలపై సవాల్ విసిరితే స్పందన కరవైందని, ఇది ఆయన వైఖరికి నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు. "సవాల్ చేస్తే సౌండ్ ఆఫ్!" అంటూ జగన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "బురద చల్లడం పారిపోయి ప్యాలెస్‌లో దాక్కోవడం జగన్ గారికి అలవాటు. తల్లికి వందనం డబ్బులు నా జేబులోకి వెళ్ళాయి అంటూ చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని ఛాలెంజ్ చేసాను. సమయం ముగిసింది, రుజువు చెయ్యలేదు, క్షమాపణ కోరలేదు. అందుకే మిమ్మల్ని ఫేకు జగన్ అనేది. లీగల్ యాక్షన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి. సమయం లేదు మిత్రమా! శరణమా... న్యాయ సమ-రమా? తేల్చుకోండి" అంటూ జగన్ కు లోకేశ్ అల్టిమేటమ్ జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు, మిగతా రూ.2 వేలు పాఠశాలలు/కాలేజీల అభివృద్ధి నిధుల నిమిత్తం ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే, ఈ రూ.2 వేలు మంత్రి నారా లోకేశ్ జేబులోకి పోతున్నాయంటూ వైసీపీ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే నారా లోకేశ్ సవాల్ విసిరారు.

# మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది

**● నాణ్యమైన మామిడికాయలను వివిధ ప్రవేట్ కంపెనీలకు రైతులు సరఫరా చేయాలి**

**● రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు 168 కోట్ల రూపాయలు సబ్సిడీ రూపంలో అందజేస్తుంది**

**● రాష్ట్ర వ్యవసాయ, సహకార అనుబంధ రంగాల శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు**



**చిత్తూరు,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి సబ్సిడీ రూపంలో 168 కోట్ల రూపాయలు చెల్లిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అనుబంధ రంగాల శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలో ఒక్కరోజు పర్యటనలో భాగంగా చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని గుడిపాల మండలంలో గొల్లమడుగు నందు మామిడికాయల నిల్వ ఉంచిన పండ్ల యూనిట్ ను, కంపెనీ నందు మామిడికాయ ప్రాసెస్ యూనిట్లను, మామిడికాయ జ్యూస్ ఎలా తయారవుతుందో పరిశీలించారు. అనంతరం పల్లూరు నందు మామిడి రైతులతో ముచ్చటించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రివర్యులు మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆలోచనతో మామిడి రైతులను ఆదుకోవడానికి ఈరోజు కంపెనీలతో చర్చించి ఒక ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. వివిధ కంపెనీలు 8 రూపాయలకే కేజీ మామిడి పండ్లు ధర నిర్ణయించడం జరిగిందని 4 రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు వారి వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల స్వేచ్ఛగా వారు పండించిన మామిడి పంటను, మండిళ్లలో గాని, మార్కెట్లో గాని అమ్ముకోవచ్చునని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చివరి కాయ వరకు విక్రయించుకోవచ్చునని , 2019వ సంవత్సరంలో జిల్లాలో మామిడి ధరను ఆనాటి ప్రభుత్వం తెలుగుదేశం హయాంలో 7.50 పైసలకు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులు నాణ్యమైన మామిడికాయలను కంపెనీలకు సరఫరా చేయాలని ఆదేశించారు. మామిడి రైతులకు 168 కోట్ల రూపాయల సబ్సిడీ రూపంలో అందజేస్తున్నామని మంత్రివర్యులు తెలిపారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. రైతులు మార్కెట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద మామిడికాయలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం 22 మెట్రిక్ టన్నులు మామిడికాయలను కొనడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ ప్రసాద్ రావు, హార్ట్ కల్చర్ సెక్రెటరీ రాజశేఖర్ బాబు, ఆర్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# వాసవి హెూమం





**పెనుగొండ,కలంకౌంటర్ :** కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి వచ్చిన భక్తులు వైభవంగా వాసవి హెూమం, గోపూజ పాల్గొన్నారు.

# మానవ హక్కులకు భంగం కలిగించవద్దు

**- డివిజనల్ చైర్మన్ తాళ్లూరి సౌరిబాబు**




**పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా),కలంకౌంటర్ :** పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డివిజనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన డివిజనల్ చైర్మన్ తాళ్లూరి సౌరిబాబు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘన ఎక్కడైతే జరుగుతుందో అక్కడ నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు ఉంటారని తెలిపారు. రానున్న రోజుల్లో డివిజనల్ పరిధిలో ఉన్న ఆరు జిల్లాల్లో కమిటీలు పూర్తిచేసి క్షేత్రస్థాయిలో అవినీతి అక్రమాలపై ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు,వివిధ నియోజకవర్గాల కమిటీ సభ్యులు,మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అన్న ప్రసాద భోజనాలు పంపిణీ




**కారంపూడి (పల్నాడు జిల్లా),కలంకౌంటర్ :** పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో శ్రీ వాసవి సేవ అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో అన్న ప్రసాద భోజనాల పంపిణీ కి ఈవారం దాతలుగా వెలుగూరి శ్రీనివాసరావు ధర్మపత్ని వరలక్ష్మి సిల్వర్ జూబ్లీ వివాహ వార్షికోత్సవ సందర్భంగా కుమారుడు వెలు గూరి వంశీ ధర్మపత్ని సాయి మహేశ్వరి, కుమార్తె భవిత కుమారి,అల్లుడు కూతురు పోకూరి కైలాష్ ధర్మపత్ని మౌనిక సహాయంతో అన్నప్రసాద భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, అన్న ప్రసాద మహిళా కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి, మాడిశెట్టి పుష్పలత, పల్లా పద్మ, చింతల శారద, గుండా మహేశ్వరి, చిన్ని అనంతలక్ష్మి, సూరే ధనలక్ష్మి, మద్దు హైమావతి, గుండా ప్రసన్న, ఊటుకూరి వాణి, చింతా సుశీల, చింతా రేణుక, ఊటుకూరివెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఈబీసీ కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు : సీఎం రేవంత్ రెడ్డి

**● సీఎం రేవంత్ రెడ్డి తో ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి భేటీ**



**హైదరాబాద్,కలంకౌంటర్ :** ఈబీసీ జాతీయ అధ్యక్షులు, అగ్రకులాల నిరుపేదల సంఘాల జేఏసీ చైర్మన్ వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తో జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో సమావే శమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో ఈబీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఈబీసీల అభివృద్ధికి మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాల ని, ఈబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి కి వినతిపత్రం అంద జేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ అభి వృద్ధి కార్యక్రమాలు అన్నిటినీ అగ్రవర్ణాలలోని నిరుపేదలకు వర్తింపజేయాలని రవీందర్ రెడ్డి తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన రేవంత్ రెడ్డి త్వరలో ఈ బీ సి కార్పొ రేషన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు 85 శాతం అమలు చేసాం

**● ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ అందిస్తున్నాం ● కొలుసు పార్థసారథి రాష్ట్ర మంత్రి**





**విజయవాడ,కలంకౌంటర్ :** ఏడాది కాలంలో సూపర్ సిక్స్ లో హామీలను 85 శాతం వరకు అమలు పూర్తి చేశామని గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బందరు రోడ్డులో మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడు తూ కూటమి సర్కార్ ఏడాది పాలనలో మాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముందుకు తీసుకెళ్లుతున్నామన్నారు. గత ప్రభుత్వం వారసత్వంగా 10 లక్షల కోట్ల అప్పుల గంప మాకు అందించిందని, అయినా వెనక్కి తగ్గకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను మా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు హామీ ఇచ్చిన ప్రకారం సూ పర్ సిక్స్ పథకాలు ఏడాది పాలనలో 85 శాతం అమలు చేసారన్నారు. ఇది మా ముఖ్యమంత్రి చిత్తశు ద్ధికి నిదర్శనమన్నారు. విజన్ 2047 లక్ష్యానికి అనుగుణంగా మా ప్రభుత్వం 15 శాతం అభివృద్ధి లక్ష్యంతో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి ఇస్తామని చెప్పి ఒక్కరికి మాత్రమే అందించగా మా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. రేపు, ఎల్లుండి కూడా తల్లుల ఖాతాల్లో డబ్బులు పడతాయన్నారు. తల్లికి వందనం పథకం ఇంత పెద్ద ఎత్తున ఎవరూ అమలు చేయలేదన్నారు. అసెంబ్లీకి రాని వారు దేశం లో కేవలం ఆ పార్టీ లో మాత్రమే ఉన్నారన్నా రు. ఒక వేళ వచ్చినా వాళ్ల సొంత పనుల కోసం వస్తున్నారు తప్ప ప్రజల సమస్యలు పట్టవన్నారు. తల్లికి వందనం డబ్బులు రెండు వేలు మంత్రి నారా లోకేష్ జేబులో వేసుకుంటున్నారని అన్నారని దానికి లోకేష్ సవాల్ విసిరారని అందుకు సిద్ధమా అని అడిగారు. ఏడాదిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కింద రూ. 34 వేల కోట్లు అందించామన్నారు. గతంలో కంటే సంక్షేమ రంగానికి ఎక్కువగా నిధులు కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ క్రింద రైతన్నకు ఈ నెలలోనే సాయం అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో యావరేజ్ గా ప్రతి కుటుంబానికి రూ. 30,000 అందించగా, మేము ప్రతి కుటుంబానికి సూపర్ సిక్స్ ద్వారా రూ. 1.04 లక్షల రూపాయలు అందించామన్నారు. గత ప్రభుత్వంలో పిల్లల భవిష్యత్ గురించి కనీసం ఆలోచించలేదన్నారు. మేము వారి భవిష్యత్ గురించి ఆలోచించి రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకువచ్చి ఉద్యోగాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని దాని ద్వారా దాదాపు 8 లక్షల పైచిలుకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో మేనిఫెస్టో బైబిల్, ఖురాన్ అని, ప్రజలను గాలికి వదిలేచారని, వారి భవిష్యత్ గురించి ఆలోచించలేదన్నారు. తల్లికి వందనం, ఫీజ్ రియంబర్స్ మెంటు ఇస్తున్నామన్నారు. మేము పిల్లలును చదివించి వాళ్ళకు మంచి ఉద్యోగాలు ఇచ్చే లా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు అన్నీ అమలు చేస్తున్నామన్నారు. మేము సామాన్యులను ఎక్కడా కేసులు పెట్టి వేదించడం లేదన్నారు. గత ప్రభుత్వం అవగాహన రాహిత్యం తో ఈ పని చేసిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.. గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు వల్ల రాష్ట్రం నుండి పెట్టుబడిదారులు పొరుగు రాష్ట్రాలకు పారిపోయారన్నారు.. అందులో అశోక్ లైలాండ్, అమర్ రాజా లాంటి తదితర సంస్థలు ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు అన్ని రంగాల్లో సమాన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తల్లికి వందనం లబ్ధిదారులైన తల్లులు, పిల్లలతో కలసి మంత్రి కేకు కట్ చేశారు.

# కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో యోగాంధ్ర

**● యోగా వృక్షాసన భంగిమ లో మానవ హారం ● బ్రిడ్జి లంకలో జిల్లా స్థాయి యోగాంధ్ర**

**● జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు**

**కొవ్వూరు (తూర్పు గోదావరి జిల్లా),కలంకౌంటర్ :** సుందర గోదావరి తీరాన, ప్రభాత కిరణాల వెలుగులో, పక్షుల కిలకిల రావాలు, మనో హర ప్రకృతి దృశ్యాల మధ్య, ఆధ్యాత్మిక శోభ తో విరాజిల్లే కొవ్వూరు గోష్పాద క్షేత్రం విఐపి ఘాట్ లో "యోగాంధ్ర" రాష్ట్రస్థాయి కార్యక్రమం శనివారం విజయవంతంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు ఆధ్వర్యంలో జరిగింది. ఆర్డీవో రాణి సుస్మిత కార్యక్రమాన్ని పర్యవేక్షించడం జరిగింది. అత్యంత ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, వేద పాఠశాల విద్యార్థులు, వయో వృద్ధులు, మహిళలు, యువత, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తో "ఆర్ట్ ఆఫ్ లివింగ్" సంస్థకు చెందిన యోగ గురువు సరోజ యోగాసనాలు వేయించారు. అనంతరం బ్రహ్మకుమారి సోదరి రాజయోగ ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ... ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు నిర్వహించే కార్యక్రమానికి సన్నద్ధంగా యోగా సాధన ట్రయల్ రన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గోష్పాద క్షేత్రం అటు ఆధ్యాత్మికంగానూ, ఇటు పర్యాటకంగానూ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని చెప్పారు. 21వ తేదీన అనేక వేదికల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అన్ని వేదికల్లోనూ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లాలో ఏడు లక్షల , 64 వేల మంది (99 శాతం ) యోగాంధ్ర కార్యక్రమంలో నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం యోగా చేస్తున్నవారు యోగాంధ్ర కార్యక్రమం తర్వాత కూడా యోగ సాధన కొనసాగించాలని, యోగాను తమ జీవనంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. జూన్ 15 ఆదివారం గోదావరి నది మధ్య బ్రిడ్జి లంకలో జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. మనం తీసుకునే ఆహార విషయంలో క్రమ పద్ధతి లేకపోవడం, కంప్యూటర్ల పై అధిక సమయం గడపడం, తదితర కారణాలవల్ల చిన్న వయసులోనే ఎక్కువమంది మధుమేహం, మోకాళ్ళ నొప్పులు, గ్యాస్ సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటువంటి సమస్యలకి యోగా సాధన మంచి పరిష్కారం చూపుతుందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడు పదుల వయసులో ఉన్నా ఇంత ఆరోగ్యంగా ఉండడానికి , పరిమితి తో కూడిన ఆహారం తీసుకోవడం, నిత్య యోగా సాధనే కారణమన్నారు. మంచి ఆరోగ్యానికి మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని సూచించారు. జూన్ 21 తేదీన మరింత మంది యోగా సాధన కార్యక్రమం లో పాల్గొనాలని, ఈరోజు వచ్చిన వారు వారి కుటుంబ సభ్యులతో కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్, నోడల్ అధికారి ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ... ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యం ఉన్నందువల్లనే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ప్రభుత్వం గోష్పాద క్షేత్రాన్ని ఎంపిక చేసిందని చెప్పారు. వాడ,వాడలా యోగ సాధన చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం అయిన 21వ తేదీ కూడా ఇదే ఉత్సాహంతో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ.. యోగ ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం లభిస్తాయని చెప్పారు. వృక్షాసనం ఆకృతిలో కూర్చున్న యోగ సాధకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కొవ్వూరు చైర్ పర్సన్ బావన రత్నకుమారి, డిఎల్డిఓ స్లీవా రెడ్డి, కమిషనర్ టీ నాగేంద్ర కుమార్, వివిధ శాఖల అధికారులు , స్థానిక ప్రజాప్రతినిధులు, వేద పండితులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో వైద్యానికి మొదటి ప్రాధాన్యత

**● 11వ విడతలో 21మందికి రూ.38,92,386లు సహాయం**



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 11వ విడత ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ 21 మందికి రూ.38,92,386లను చెక్కుల ద్వారా అందచేశారు. పది విడతల్లో 334మందికి రూ.2,25,37,424లు ఆర్థిక సహాయం చేసినట్లు వివరించారు. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం కోరుతూ పేదలు పంపే దరఖాస్తులను సాధ్యమైనంత వేగంగా సహాయం మంజూరు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు లబ్ధిదారుల తరపున ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ధన్యవాదములు తెలిపారు.

**లబ్ధిదారుల వివరాలు :** డొక్కు నరసింహారావు రూ.1,64,837/- సజ్జా సాంబశివరావు రూ.30వేలు/- తుంగల భాస్కరరావు రూ.31,192/- భూపతి సులోచన రూ.ఇరవై వేలు/- పెంద్ర ఝాన్సీ రూ.2,64,748/- గొరిపర్తి నాగమణి రూ.25,541/- పరిశే నల్లబాబు రూ.2,54,748/- సూరపనేని హనుమంతరావు రూ.50వేలు/- రేపల్లె అంకమ్మ రూ.లక్షన్నర/-(ఎల్ఓసీ) కొండపల్లి చిట్టియ్య చౌదరి రూ.60వేలు/- నడకుదుటి మస్తాన్ రావు రూ.రెండు లక్షలు/-(ఎల్ఓసీ) బండ్రెడ్డి శివద్రాక్ష రూ.25,574/- పంచల నాగేశ్వరమ్మ రూ.30వేలు/- భోగాది భాస్కరరావు రూ.1,29,231/- మేడా బుజ్జాలరావు రూ.1,68,002/- మత్తి నాంచారమ్మ రూ.1,01,840/- జంపాన అజయ్ కుమార్ రూ.36,673/- నాగిడి సాంబయ్య రూ.3లక్షలు/-(ఎల్ఓసీ) చందన రామకృష్ణ రూ.2,50,000/-(ఎల్ఓసీ) దోవారి వెంకటేశ్వరమ్మ రూ.8లక్షలు/- (ఎల్ఓసీ) నాదెళ్ల అభిరామ్ రూ.8లక్షలు/- (ఎల్ఓసీ)

# తల్లికివందనంతో చరిత్ర సృష్టించిన చంద్రబాబు




**అవనిగడ్డ,కలంకౌంటర్ :** జగన్ కి, అతని కాలకేయ ముఠాకు రాష్ట్రం అభివృద్ధి చెందడం, పేదవాడు సంతోషంగా ఉండటం నచ్చదు. అందుకే తల్లికి వందనం పథకం పై సైతం దుష్ప్రచారం చేస్తున్నారు.టీడీపీ తెలుగు యువత అధ్యక్షులు మేడికొండ విజయ్ అన్నారు శనివారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ లో కీలకమైన తల్లికి వందనం పథకం అమలయ్యేసరికి పేటీఎం గొర్రెలకు, వైసీపీ నాయకులకు గొంతులో పచ్చి వెలక్కాయ పడిందని. దానితో ఏమి మాట్లాడాలో తెలియక అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు 2019 నుంచి 2024 వరకూ ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఆర్థిక విధ్వంసంతో 2024 ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఏ స్థితికి దిగజారిందో అందరికీ తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగులకు జీతం ఇవ్వాలి అంటే అప్పు కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి జగన్ జమానాలో ఉండేది. కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్ది, ఒకపక్క అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ, సూపర్ సిక్స్ అమలు చేస్తోందని ఉత్తి బటన్లు నొక్కి డబ్బా కొట్టుకోవడం జగన్ నైజం అన్నారు ఎన్నికల ముందు విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు నొక్కేసి తనవారికి కాంట్రాక్టు బిల్లులు రిలీజు చేసిన ఘనత జగన్ ది. జగన్ ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ తాను ఇవ్వటమే కాకుండా ఇచ్చిన మాట ప్రకారం ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం జమ చేసిన ఘనత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పవన్ కళ్యాణ్ దే అన్నారు ఇక పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, బెల్టులు విద్యార్థులకు అందించిన ఘనత నారా లోకేశ్ ది అని టీడీపీ తెలుగు యువత అధ్యక్షులు మేడికొండ విజయ్ చెప్పారు

# ఉచిత అన్నా క్యాంటీన్ ఏర్పాటు చెయ్యాలి లకనం



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ( ఏయిమ్స్ )హాస్పటల్ మంగళగిరి వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఉచిత అన్నా క్యాంటీన్ ఏర్పాటు చెయ్యాలని టీడీపీ నేత ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు శనివారం ఆయన అవనిగడ్డ మత్స్య భవనం వద్ద విలేఖర్లతో మాట్లాడుతూ రాజధాని అమరావతికి సమీపంలో కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎయిమ్స్ హాస్పటల్ కు రాష్ట్రం లోని మారుమూల సుదూర ప్రాంతాల నుంచి పేద ప్రజలు వైద్య సౌకర్యం కొరకు ప్రతి రోజూ ఒక ఎయ్యి నుంచి పదమూడు వందల వరకు వివిధ అనారోగ్య కారణాల రీత్యా ఈ హాస్పటల్ కు వస్తూ, పోతుంటారన్నారు. రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్టులు కొరకు ఒకటి, రెండు రోజులు రోగులు ఆగాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నవాన్నారు. అలాంటి వారికి వసతి సౌకర్యం కూడా కల్పించాలని నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు

# విద్యుత్ వినియోగదారులకు గమనిక

**అవనిగడ్డ,కలంకౌంటర్ :** ఆదివారము ఏపీ ట్రాన్స్కో వారి 400 కె.వి వేమగిరి - సత్తెనపల్లి TMDC లైన్ నుండి ప్రతిపాదిత 400/220 కెవి ఎస్ ఎస్ గుడివాడ వరకు 400కేవి TMMC LILO కొత్త ట్రాన్స్మిషన్ లైన్ స్ట్రింగింగ్ పనులు చేయవలసి ఉన్నది. ఆ పనిలో భాగంగా గుడివాడలోని 220KV విద్యుత్ ఉపకేంద్రము లో నున్న - గుడివాడ 1&2 ట్రాన్స్మిషన్ లైన్స్ విద్యుత్ సరఫరాని తాత్కాలికంగా ఆపివేయడం జరుగుతుంది. అవనిగడ్డ లోని 132 కెవి విద్యుత్ ఉప కేంద్రం మరియు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి కృష్ణ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.కావున ప్రజలు అందరూ ఈ విషయం గమనించి సహకరించవలసిందిగా కోరారు కావున అవనిగడ్డ మండలం లో ఉదయం 08.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయాని సహకరించాలని కోరారు.

# గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్లు మంజూరు....

**-గద్దర్ జయంతి వేడుకల్లో ఫౌండేషన్‌కు భాగస్వామ్యం**

**హైదరాబాద్,కలంకౌంటర్ :** ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆలోచనలు, ఆయ న ఆశయాలను ముందుకు తీసుకెళ్లేం దుకు గానూ గద్దర్ ఫౌండేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూ రు చేసింది. ఫౌండేషన్‌కు అవస రమైన నిధులు కేటాయిస్తామని గతంలో జరిగిన గద్దర్ జయంతి వేడుకల్లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఉద్యమం, సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసిన గద్దర్ సేవ లకు గుర్తింపుగా ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధి కారి కంగా జరుపుతోంది. ఇక ముందు గద్దర్ జయంతి వేడుకల కార్యక్రమాల నిర్వహణలోనూ గద్దర్ ఫౌండేషన్‌కు భాగస్వామ్యం కల్పిస్తూ మరో ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేసింది.

# ఇండియన్ ఐకాన్ అవార్డు అందుకున్న వాణి సంస్థ ఎం డి దిలీప్







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఐకాన్ కేటరర్స్ బి2025 అవార్డు వాణి సంస్థ ఎం డి పల్లపోతు దిలీప్ హైదరాబాద్ ది పార్క్ హొటల్ లో అందుకు న్నారు. కేటరింగ్ విభాగంలో ఉత్తమ సేవలు,నాణ్యత,కస్టమర్ల ప్రశంసలు పొందిన వాణి సంస్థ కు ఈ అవార్డు రావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మచిలీపట్నం తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో,ఇతర నగరాల్లో కూడా వాణి కేటరర్స్ సేవలు అందిస్తోంది.

# సామినేని తో బండి రామకృష్ణ భేటీ



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సి ఎం ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయాల పై కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల ముచ్చటించారు వారితోపాటు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గద్దం రాజు పాల్గొన్నారు

# జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) తో బండి రామకృష్ణ భేటీ



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** శ్రీరామ్ తాతయ్యను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా క లిసినమచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సి ఎం ఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అనంతరం కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల ముచ్చటించారు వారితోపాటు జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గద్దం రాజు పాల్గొన్నారు

# తల్లికి వందనంతో తల్లిదండ్రుల్లో ఆనందోత్సాహాలు - ఎమ్మెల్యే ఇంటూరి

- తల్లికి గౌరవం ఇవ్వలేని వ్యక్తి తల్లికి వందనం గురించే మాట్లాడటం సిగ్గుచేటు
- మంత్రి లోకేష్ పై తప్పుడు ప్రచారం చేస్తున్న జగన్ అండ్ కో



**కందుకూరు,కలంకౌంటర్ :** తల్లికి వందనంతో తల్లిదండ్రుల్లో ఆనందోత్సాహాలు తాండవిస్తున్నాయని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. తల్లికి వందనం పథకం పై ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పందిస్తూ గత ప్రభుత్వంలో ఒక్కరి మాత్రమే జగన్ ఇచ్చేవాడని, కానీ నేడు కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద వారి ఖాతాల్లో జమ అవుతుందని అన్నారు. తల్లికి గౌరవం ఇవ్వలేని వ్యక్తి తల్లికి వందనం గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. మంత్రి లోకేష్ పై జగన్ అండ్ కో తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసిన ఇంకా జగన్ కు బుద్ధి రాలేదని, ఇప్పటికైనా ఆ దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. కందుకూరు నియోజకవర్గం తల్లిదండ్రుల తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు, మంత్రి నారా లోకేష్ కు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల మొదలయ్యే రోజు తల్లిదండ్రుల ఖాతాలో డబ్బులు జమ చేస్తూ తల్లిదండ్రుల విశ్వాసం పొందిన ఈ పథకంపై జగన్ రెడ్డి అసహనంతో తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు మండిపడ్డారు.

# వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి 25 లక్షలు

**- జనసేన పార్టీ తరపున అందజేసిన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి**





**పెనుగొండ (శ్రీ సత్యసాయి జిల్లా ),కలంకౌంటర్ :** ఆపరేషన్ సింధూర్ లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ తల్లి తండ్రులకు జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రకటించిన 25 లక్షల ఆర్థిక సాయాన్ని ఆ పార్టీ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయ కృష్ణ లు శనివారం ఉదయం అందించారు. మురళీ నాయక్ స్వగ్రామం కల్లితండా కు స్థానిక జనసేన నాయకులు లతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తో కలిసి చెక్ ను ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, నిమ్మక జయకృష్ణ లు శ్రీరాం నాయక్, జ్యోతి బాయి లకు అందించారు. మురళీ నాయక్ ఆపరేషన్ సింధూర్ లో మృతి చెందటం పవన్ కల్యాణ్ ని కలిచి వేసిందని ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, నిమ్మక జయకృష్ణ లు తెలిపారు. మురళీ నాయక్ అంత్యక్రియలకు వచ్చి పవన్ కళ్యాణ్ నివాళులు ఆరోపించడంతో పాటు మూడు గంటలు ఉన్నారని వారు గుర్తుచేశారు. మురళీ నాయక్ మృతితో అధైర్యపడ్డ వారి తల్లితండులకు ధైర్యం చెప్పి తన సొంత నిధుల నుంచి 25 లక్షలు ఆర్థిక సాయం పవన్ కళ్యాణ్ ప్రకటించారని వారు తెలిపారు. పవన్ కళ్యాణ్ సూచనల మేరకు తాము 25 లక్షల చెక్ ను శ్రీరాం నాయక్, జ్యోతి బాయి లకు అందించినట్లు వారు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకులు లోకేష్ లు ప్రభుత్వం తరుపున 50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారని వారు గుర్తు చేశారు. ఐదెకరాల వ్యవసాయ భూమి, ఇంటి జాగా త్వరలోనే మురళీ నాయక్ తల్లితండ్రులకు అధికారులు అందిస్తారని వారు తెలిపారు. మురళీ నాయక్ వాలీ బాల్ ఆటగాడని తమ తండాలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయాలని మురళీ నాయక్ తల్లితండ్రులు ఎమ్మెల్యేలను కోరారు. అలాగే తమ తండా పేరును మురళీ నాయక్ తండాగా మార్చడంతో పాటు రోడ్ల నిర్మించాలని కోరారు. అలాగే ఆర్చ్ కూడా నిర్మించి సహాయ పడాలని వారు ఎమ్మెల్యేలను కోరారు. మురళీ నాయక్ తల్లి తండ్రులు కోరిన అన్ని కోరికల్ని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ల దృష్టికి తీసుకెళ్లి పరిస్కరిస్తామని ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో.. రాజారెడ్డి, స్థానిక నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.










Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com